ప్రజాశక్తి
శనివారం 8 మార్చి 2025
5
విజయనగరం

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధానన్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు జిల్లాల వ్యాప్తంగా 21 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మున్సిపాలిటీ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చని చెప్పారు. కక్షిదారులు, ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్కడమ్మా నువ్వు లేనిది



- ఊరిలో అధికారిగా...
- పోరులో అధినేత్రిగా..
- ఇంటి నడిపే ఇల్లాలిగా..
- సమాజ గమనంలో స్త్రీల పాత్ర అత్యంత కీలకం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటీ నీవు చేయలేనిది' అని కీర్తింపబడుతున్న మహిళ ఒక వైపున అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది.. నవమాసాలూ మోసి, పిల్లల్ని కని తల్లిగా లాలిస్తూ, పాలిస్తూ పెద్ద చేస్తోంది.. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతోంది.. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది.. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. ఇలా మహిళ అన్నింటా కీలకంగా వ్యవహరిస్తోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, హోంగార్డు నుంచి మేజర్ వరకు రాణిస్తోంది.. క్రీడా, కళా, రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ రంగంలోనూ వారిదే కీలకపాత్ర. ఇలాంటి వారు మన జిల్లాలోనూ కోకొల్లలుగా కనిపిస్తారు. ఇలా అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నా మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. ఆఖరికి అమ్మాయి పుట్టుకే అశుభమనుకునే స్థాయికి నేటి సమాజం దిగజారి పోయింది. ఆడబిడ్డగా నిర్ధారణ అయితే భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఇంటి గుమ్మం దాటితే తలదించుకోవాలన్న దగ్గర నుంచి మగాళ్లతో మాట్లాడకూడదన్న వరకు అన్నీ ఆంక్షలే. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నా, వారి కుటుంబసభ్యులే పెత్తనం చలాయిస్తున్నారు. వరకట్నం, వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లలంటే ఎంతోమంది భారంగా భావిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మహిళలకు మరిన్ని కష్టనష్టాలు ఎదురౌతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ సగర్వంగా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే..

మహిళలకు ఓటు హక్కు కల్పించాలని, స్త్రీ, పురుషులకు సమాన వేతనం కల్పించాలని, పనిగంటలు తగ్గించాలని, 1908లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీనికి స్ఫూర్తిగా అక్కడి సోషలిస్టు పార్టీ 1909లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. క్రమంగా ప్రపంచ దేశాలకు ఈ కార్యక్రమం విస్తరించింది. ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. ప్రస్తుతం అన్ని పార్టీలు, ప్రభుత్వాలు నిర్వహించాల్సిన పరిస్థితి, ఆవశ్యకత ఏర్పడింది.

మహిళా హక్కులను ప్రభుత్వాలే హరిస్తున్నాయి

మహిళల స్వేచ్ఛ, హక్కులను ప్రభుత్వాలే హరింపజేస్తున్నాయి. హత్యలు, అత్యాచారాలు, వివక్షత చూపుతున్న వారిపై ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదు. ప్రభుత్వాలు మహిళలపై చూపుతున్న నిర్లక్ష్యం వల్ల పసికందులు, వృద్ధులపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. పనిప్రదేశాల్లో వేధింపులు ఆగడం లేదు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వీటన్నింటిని కట్టడిచేసే విధంగా విధానాలు రూపొందించడంతోపాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. అలా కాకుండా కేవలం మహిళా దినోత్సవాలు మాత్రమే నిర్వహించడం వల్ల ఉపయోగం లేదు.

- వి.లక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్

మహిళా రిజర్వేషన్లపై చిత్తశుద్ధి కరువు

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందువల్లే అమలు చేయలేదు. స్త్రీ, పురుష సమానత్వం దేశవ్యాప్తంగా అమలు కావడం లేదు. మహిళలను అవమానపరిచే ఘటనలు గడిచిన పదేళ్లుగా పెరిగాయి. శ్రామిక మహిళలు సాధించిన హక్కులు, చట్టాలు రక్షించబడాలంటే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి. రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి మహిళలు ఉద్యమించాలి. కానీ, అదే రాజ్యాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. కనీసం పోరాడి సాధించుకున్న మహిళా చట్టాలను సమర్థవంతంగా అమలు చేసే పరిస్థితి నేడు కనిపించడం లేదు. సమాన పనికి సమాన వేతనం కల్పించడం లేదు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి పోరాటానికి మహిళలు సిద్ధం కావడమే నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కర్తవ్యం కావాలి.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

పశువైద్య కళాశాల విద్యార్థుల

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-చీపురుపల్లి

వెటర్నరీ విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గరివిడిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం ఆ కళాశాల గేటు వద్ద నిరసన చేపట్టారు. 33 రోజుల నుంచి పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వెటర్నరీ విద్యార్థులు రోడ్డు పాలయ్యారన్నారు. ఆరోగ్య సంబంధిత విద్యా రంగాల్లో ఇంటర్న్ పీజీలు, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.25 వేల నుంచి 65 వేల వరకు స్టైఫండ్‌ను ప్రభుత్వం ఇస్తోందన్నారు. వెటర్నరీ విద్యార్థులకు రూ.7 వేలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పశువుల రక్షణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెటర్నరీ విద్యార్థుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఇ.వంశీ, సిహెచ్ రమణ, చీపురుపల్లి మండల కమిటీ సభ్యులు మధు, జగదీష్, నాని, నీలిమ, చైతన్య, సాయి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

హాజరుకానున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసిందని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరవుతారని చెప్పారు. ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా తదితర శాఖల ఆధ్వర్యంలో సుమారు 3 వేల మంది మహిళలు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి రాజీవ్‌స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథుల సందేశాల అనంతరం అసెట్ పంపిణీ, మహిళలకు సన్మానాలు, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేయడం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, మహిళలంతా పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎల్లారమ్మ ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన జనం ; కోలాటం ఆడుతున్న మహిళలు

ఎల్లారమ్మ జాతరకు

పోటెత్తిన జనం

ప్రజాశక్తి - జామి

జామిలోని ఎల్లారమ్మ తీర్థం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు జాతరకు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి యాత్రికులు ముడుపులు చెల్లించారు. గ్రామదేవతల పండుగలకు భిన్నంగా ఎల్లారమ్మ జాతర నిర్వహిస్తారు. జంతు బలులు లేకుండా, సంప్రదాయ పద్ధతిలో ముడుపులు చెల్లించడం ప్రత్యేకత. ఈ సందర్భంగా జరిగే జాతరకు పెద్దఎత్తున ఏటా యాత్రికులు తరలివస్తారు. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువులు, రంగుల రాట్నం, సర్కస్ వంటి అనేక పిల్లల్ని ఆకర్షించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నేపథ్యంలో జాతర రెండు రోజులు కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. జామి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

నేడు చిన్న తీర్థం

మూడు రోజులపాటు జరిగే ఎల్లారమ్మ జాతరలో భాగంగా శనివారం చిన్నతీర్థం జరగనుంది. మూడు రోజుల పండగ నేపథ్యంలో బంధువులు, స్నేహితులకు సపర్యాలు చేసి అలసిపోయిన గ్రామస్తులకు ఉపశమనంగా గ్రామంలోని కొత్తలివారి కోవెల వద్ద తీర్థం ఏర్పాటు చేస్తారు. దీన్ని దమ్మిడీ తీర్థంగా కూడా పిలుస్తారు.

అభివృద్ధి పనులకు ఎమ్‌పి నిధులు

ప్రజాశక్తి-విజయనగరంకోట



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో శుక్రవారం కలెక్టరేట్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఎమ్‌పి లాడ్స్ నిధులు విడుదలపై చర్చించారు. ప్రతిపాదించిన పనులన్నీ వెంటనే చేపట్టేందుకు వీలుగా అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ప్రారంభించేలా ఆదేశాలిస్తామని కలెక్టర్ చెప్పారు.

అనకాపల్లి జిల్లా కె.డి.పేటలో స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు సమాధి వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు తన ఎమ్‌పి నిధుల నుంచి అసెంబ్లీ స్పీకర్ కోరిన మేరకు రూ.10 లక్షలు మంజూరు చేశామని, ఆ నిధులను అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి పంపించాలని ఎమ్‌పి.. కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో చేపడుతున్న ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన పనులపై కూడా ఎమ్‌పి... జిల్లా కలెక్టర్‌తో చర్చించారు

కలెక్టర్‌తో ఎమ్‌పి కలిశెట్టి భేటీ

జన ఔషధ కేంద్రం ప్రారంభం

నగరంలోని హెడ్ పోస్టాఫీసు ఎదురుగా డిసిఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జన ఔషధ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం జనరిక్ మందులనే వినియోగిద్దామని చెప్పారు. ప్రజలకు అతి తక్కువ ధరలకు మందులను అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.జీవనరాణి, క్షయ, లెప్రసీ డాక్టర్ రాణి, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

కేసు కొట్టేయడంతో కోర్టు బయట సంతోషం వ్యక్తంచేస్తున్న నాయకులు

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

సిఐటియు నాయకులపై నమోదైన కేసును శుక్రవారం మొబైల్ కోర్టు కొట్టివేసింది. 2018లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఒకటో పట్టణ పోలీసులు.. సిఐటియు నాయకులు ఎం.కృష్ణమూర్తి, టివి రమణతోపాటు 20 మందిపై కేసు నమోదు చేశారు. ఆరేళ్ల విచారణ అనంతరం పోలీసులు పెట్టిన కేసు సరైనది కాదని మొబైల్ కోర్టు జడ్జి నిర్ధారించారు., సిఐటియు నాయకులు, కార్మికులు తప్పు చేసినట్లుగా నిర్ధారణ కాలేదని, ఈ కేసును కొట్టివేస్తున్నట్లుగా తీర్పు ఇచ్చారు. ఈ కేసులో కార్మికుల తరుపున న్యాయవాది కె.సన్యాసిరావు వాదించారు.

డ్రోన్ సహాయంతో దాడులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని వైఎస్ఆర్ నగర్ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపై రెండో పట్టణ పోలీసులు డ్రోన్ సాయంతో దాడులు చేపట్టారు. గురువారం రాత్రి వైఎస్ఆర్ నగర్ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపైకి డ్రోన్లను పోలీసులు పంపించారు. శివారు ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లుగా నిర్ధారించుకొన్నారు. అక్కడ బైకులు కూడా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ శిబిరంపై రెండో పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. పోలీసుల రాకను గమనించిన పేకాటరాయుళ్లు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించి, 9 మందిని అదుపులోకి తీసుకున్నారుక. వారి నుంచి రూ.6,570 నగదు, 9 బైకులు, 7 మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను డ్రోన్ల సహాయంతో గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారు.

క్రీడా సర్టిఫికెట్లు అందజేస్తున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, డిఇఒ మాణిక్యంనాయుడు

క్రీడా సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, డిఇఒ యు.మాణిక్యం నాయుడు ప్రదానం చేశారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడలు.. ఖోఖో, కబడ్డీ, స్విమ్మింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, సైక్లింగ్, తైక్వాండో, రెజ్లింగ్ వంటి పోటీల్లో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ విభాగం ఆధ్వర్యంలో 28 మందికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ, డిఇఒ మాట్లాడుతూ క్రీడల ద్వారా మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. జాతీయ స్థాయి సర్టిఫికెట్ వల్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు.

కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ కార్యదర్శి సన్యాసిరాజు, పిఇటి, పీడీ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.వెంకటనాయుడు, ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కెవిఎస్ రాజు, చంద్రశేఖర్, సూర్యారావు, తౌడుబాబు, సత్యనారాయణ, అప్పలనాయుడు, శ్రీను, టి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురజాడ అప్పారావు బిసి స్టడీసర్కిల్ డైరెక్టర్ జి.పెంటోజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జిటి పరీక్షకు అర్హులైన జిల్లాకు చెందిన బిసి, ఇబిసి అభ్యర్థులు ఈ నెల పదో తేది నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. డిగ్రీ మార్క్సులిస్టు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, నేటివిటీ, టెట్ మార్కుల జాబితా జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలు -2 దరఖాస్తుతో జతచేయాలని కోరారు. మిగతా వివరాలకు 9603557333, 9177726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

572 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 19,603 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 19031 మంది హాజరయ్యారు. శుక్రవారం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకకు ఆహ్వానం పలుకుతూ శుక్రవారం బాలాజీ నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురంలోని చిత్రాడలో జరిగే జనసేన అవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జనసేన నాయకులు, కార్యకర్తలు నగరంలోని కోట, గంట స్థంభం, ఎత్తు బ్రిడ్జి ప్రాంతాల్లో పోస్టర్లతో ప్రచారం చేశారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమం

ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై దాడుల నివారణకు, హక్కుల కోసం పోరాటం ఒక్కటే మార్గమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్‌బిజి నగర్‌లో శుక్రవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. మహిళా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల మహిళలు ఉద్యమం చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం మహిళలకిచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు రూ.15 వేలు, తదితర హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముచ్చువానిచెరువు గట్టుపై సభ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.పుణ్యవతి, కుమారి, రమాలక్ష్మి, నగర కార్యదర్శి సి.లక్ష్మి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సుమహాసన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డాక్టరేట్ అందుకుంటున్న సుమహాసన్

జెఎన్‌టియు-జివి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి సింగుపురం సుమహాసన్ డాక్టరేట్ అందుకున్నారు. క్లౌడ్ ఆధారిత లాట్‌లో ఆరోగ్య సంరక్షణ సెన్సరీ డేటా భద్రతా, సమర్థవంతమైన ప్రసారం నోడ్-లెవల్ విధానం' అనే అంశంపై ఆయన నిర్వహించిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయన పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. సుమహాసన్ విశాఖపట్నంలోని గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (ఆటోనామస్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా సుమహాసన్‌ను పలువురు అభినందించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్‌పి వినతులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్‌పి స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొన్నారు. వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖోఖో ఆడుతున్న ఆర్‌డిఒ కీర్తి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎపిఎన్‌జిఒ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆర్‌డిఒ కీర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ వెనుకబడి లేరని చూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం ఉద్యోగ, కుటుంబ జీవితంతో గడిపే మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, పరుగు పందెం, చైర్, రింగ్ ఆట, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సురేష్, ఆనంద్, కెవి శ్రీనివాసరావు, మహిళా ఉద్యోగులు ఆదిలక్ష్మి, జ్యోతిర్మయి, శ్రీస్వప్న, కోటేశ్వరి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

బొబ్బిలి: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి అన్నారు. శుక్రవారం కాసింధొరవలస పంచాయతీ పరిధి ఎరకంధొరవలస గిరిజన గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా బొబ్బిలి పోలీస్ ఆధ్వర్యంలో బొబ్బిలి క్వీన్ ఎన్.ఆర్.ఐ, వైజాగ్ ఒమేగా పిరిడి పిహెచ్‌సి, బొబ్బిలి సిహెచ్‌సి సౌజన్యంతో శుక్రవారం మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి భవ్య రెడ్డి మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్‌పి ఆదేశానుసారం వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో నిరక్షరాస్యత, వైద్య శాలలు దూరంగా ఉండడం, పౌష్టికాహార లోపం వల్ల వీరంతా అనారోగ్యం పాలు అవుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని ఈవైద్య శిబిరాన్ని నిర్వహించామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 13 గిరిజన గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారని 400 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సతీష్ కుమార్, బొబ్బిలి, పిరిడి వైద్యులు సంతోషికుమారి, జి.భరద్వాజ్, క్వీన్ ఎన్ఆర్ఐ, ఒమేగా వైద్యులు, టిడిపి నాయకులు కేశవ, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: మహిళలను సత్కరిస్తున్న సీతం ప్రతినిధులు

మహిళలను గౌరవించాలి

బొబ్బిలి: మహిళలను గౌరవించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక శ్రీసూర్య పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమజాభివృద్ధి సాధ్యమన్నారు పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిను కౌన్సిలర్ కె.లక్ష్మి, టిడిపి నాయకులు కె.సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ సన్మానించారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. టాస్క్‌ఫోర్స్ సిఐ బంగారుపాప ముఖ్య అతిథిగా హాజరై మహిళల భద్రత, సాధికారత అనే అంశాలపై ఆమె ప్రసంగించారు. ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మహిళలు ఉన్నత లక్ష్య సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

విజయనగరంటౌన్ : మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అధ్యాపకులు జి.జనార్దన నాయుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి కీలకమని తెలిపారు. ప్రేమ సమాజంలో సేవలందిస్తున్న జానకమ్మను ఈ సందర్భంగా సత్కరించారు. సమన్వయకర్తగా గౌరీశ్వరరావు వ్యవహరించారు. కళాశాల అధ్యాపకులు వి.కన్నంనాయుడు, బి.సులోచన, టి.రమణ, ఎల్.వరలక్ష్మి, వి.యామిని పాల్గొన్నారు.

జెఎన్‌టియు-జివిఎం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణ కుమారి, ఇన్‌ఛార్జి వీసి డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మనలో ఉన్న ధైర్యం, శక్తి, సామర్థ్యాలను ఉపయోగించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వరరావు, వైస్‌ప్రిన్సిపల్ రమ్య అగస్టే, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. జడ్జి కె.నాగమణి, వెలెనెస్ కోచ్ ఎ.అశ్విని మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామయ్య, డబ్ల్యుఇసి కోఆర్డినేటర్ కె.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

విజయనగరం : స్థానిక సీతం కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్త మహాలక్ష్మి, వ్యాపారవేత్త హారిక, మంగమ్మ అతిథులుగా హాజరై, మాట్లాడారు. విద్యార్థినులు ఇష్టంతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. మహిళా అధ్యాపకులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపల్ డి.వి రామమూర్తి, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సెంచూరియన్‌లో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి వసతి గృహంలో మహిళా ఉపాధ్యాయులు, మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి వసతి గృహం ప్రిన్సిపాల్ కిరణ్మయి, అశోక్ రాజు, మోహన్ రాజు, శ్రీను, టి.రాంబాబు, పి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉద్యోగం

బొబ్బిలి: శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ పాఠశాలలో నేర్పిన క్రమశిక్షణతోనే ఉద్యోగాన్ని సాధించినట్లు డిఎస్‌పి జి.భవ్యరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ శ్రీ సత్యసాయి విద్యా సంస్థల్లో ఎల్.కె.జి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నట్లు చెప్పారు. శ్రీసత్యసాయి పాఠశాలలో సామాజిక సేవ, విలువలతో కూడిన విద్యను అందించడంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో టెలికాం ఇంజినీర్, రైల్వే ఉద్యోగాలను విడిచిపెట్టి ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా 2020-22 గ్రూపు-1లో 9వ ర్యాంక్ సాధించి డిఎస్‌పిగా ఉద్యోగం సాధించినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకుని చరిత్రాత్మక బొబ్బిలిలో మొదటి పోస్టింగ్ రావడం ఆనందంగా ఉందన్నారు. పోలీసు విధి నిర్వహణలో రోజుకొక కొత్త సమస్య రావడం ఇంట్రెస్టింగ్‌గా ఉందన్నారు. పిల్లలలో విలువలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తండ్రి కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని..

బొబ్బిలి: తండ్రి కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగాన్ని సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ తన తండ్రి లాలం జగ్గినాయుడు వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించారని, సెలవులలో తండ్రికి సాయంగా పొలం పనులకు వెళ్లే దానినని చెప్పారు. కష్టపడి పని చేయడం వల్ల తన తండ్రి చేతులపై బొబ్బర్లు వచ్చేవని, వాటిని చూపిస్తూ నీవు బాగా చదివి ఉద్యోగం చేయాలని చెప్పడంతో ఎలాగైనా ఉద్యోగం సాధించాలని కష్టపడి బి ఫార్మసీ పూర్తి చేశానన్నారు. బి ఫార్మసీ పూర్తి చేసిన వెంటనే వివాహం అయినప్పటికీ భర్త ప్రోత్సాహంతో కోచింగ్ తీసుకుని 2018లో గ్రూపు-2 రాసి మహిళా విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగాన్ని సాధించినట్లు చెప్పారు. తన భర్త చొక్కాకుల కన్నంనాయుడు ఆర్మీలో సిగ్నల్ డిపార్ట్మెంట్‌లో నాయక్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. మహిళలందరు ఇండిపెండెంట్‌గా ఉండాలన్నారు. ఎటువంటి ఆటుపోట్లు వచ్చిన ఎదిరించి ముందుకు వెళ్ళాలన్నారు. వివాహం చేసుకున్న తర్వాత కూడా బాగా చదివి లక్ష్యాలను చేరుకోవచ్చునని చెప్పారు.

టెక్నాలజీని ఉపయోగించుకొని అభివృద్ధి

శృంగవరపుకోట: ప్రస్తుతం ఇంటర్నెట్ ద్వారా టెక్నాలజీని, సోషల్ మీడియాని వినియోగించుకొని మహిళలు అభివృద్ధి చెందుతున్నారని మండలంలోని మామిడిపల్లి మాజీ సర్పంచ్ టి.గంగాభవాని అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఆడవారు ఎంతో అభివృద్ధి చెందారని, టెక్నాలజీని వినియోగించుకోవడమే కాకుండా సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ పురుషులకు తామేమి తక్కువ కాదంటూ సత్తా చాటుతున్నారని చెప్పారు. ప్రస్తుతం మగవారి కంటే ఆడవారి చేసే పనిలోనే ఎక్కువగా గ్రోత్ కనిపిస్తుందని నిపుణులు కూడా చెబుతున్నారన్నారు. ఇప్పటికే ప్రపంచంలో పలువురు ఆడవాళ్లు అంతరిక్ష ప్రయాణం కూడా చేసి మగవారికి ఏమి తక్కువ కాదని నిరూపించుకుంటున్నారని గుర్తు చేశారు. రానున్న రోజులలో ప్రతి పనిలో ఆడవారు తప్పనిసరిగా ఉండాలనే నానుడు వచ్చే అవకాశం ఉందన్నారు.

గిరిజన గ్రామాలలో పిల్లలకు టీకాలు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో ఇటీవల గిరిజన పిల్లలకు వైరల్ జ్వరాలు, దద్దుర్లు సోకి స్థానిక ఏరియా ఆసుపత్రిలో పలువురు చేరిన విషయం తెలిసిందే. పిల్లలకు వచ్చే ఈ వైరల్ జ్వరాలు మరింత పెరగడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో గల మొన్నపురాయి, కురిడి, పొర్లు, పల్లపు దుంగాడ, జీనబాడు గ్రామాలకు బొడ్డవర పరిధిలోగల కో లొకేటెడ్ వైద్య సిబ్బంది డాక్టర్ శిరీష, కొట్ట పిహెచ్‌సి వైద్యాధికారి జుత్తాడ హారిక, మానస తదితరులు బృందాలుగా విడిపోయి గిరిశిఖర గ్రామాలలో సుమారు 149 మంది పిల్లలకు టీకాలు వేశారు. పిల్లలందరికీ టీకాలు వేసే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎల్ఎంహెచ్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

ప్రజాశక్తి- బాడంగి

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మండలంలోని బాడంగి సమీపంలో ఉన్న ఎయిర్ పోర్ట్ భూములను శుక్రవారం విశాఖపట్నం ఎన్ఎడి అధికారులు, బొబ్బిలి ఆర్‌డిఒ రామ్‌మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ చైతన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేవీలో యుద్ధానికి సంబంధించిన సామగ్రిని దాచుటకు నిల్వ కేంద్రానికి 1800 ఎకరాలు స్థలం అవసరం నిమిత్తం క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. మొత్తం భూమిని పరిశీలన చేసి పై అధికారులకు నివేదికను పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, సర్వేయర్ వెంకటరమణ పాల్గొన్నారు.

క్వారీ టోల్‌గేట్లను ఎత్తేయండి

ప్రజాశక్తి - వేపాడ

విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో ఉన్న కార్మికుల, యజమానుల కష్టాలను, బాధలను అర్థం చేసుకొని పై నాలుగు జిల్లాల్లో ఉన్న టోల్‌గేట్‌లను ఎత్తేయాలని క్వారీ అండ్ క్రషర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ చల్లా జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని రామస్వామిపేట క్వారీ వద్ద కార్మికులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతా ఒక విధానాన్ని అమలు చేయకుండా నాలుగు జిల్లాలకే టోల్స్ ఉన్నందు వల్ల ఒక్క విజయనగరం జిల్లాలోనే 90శాతం క్రసర్లు మూతపడ్డాయన్నారు. క్రసర్లు క్వారీలలో వేలాదిమంది కార్మికులు పని చేసి జీవించే వారని, ఈ టోల్స్ బాధల వల్ల యజమానులు మూసేయడంతో కార్మికులందరూ రోడ్డున పడ్డారన్నారు. విశాఖ అనకాపల్లి జిల్లాల్లో టోల్సు లేకుండా విజయనగరం జిల్లాలో క్వారీ టోల్ గేట్ నడుస్తుండటం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి టోల్స్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన పి. జ్యోతింద్ర నారాయణ్ (42) విశాఖపట్నంలో నివసిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం వెళ్తుండగా విమానాశ్రయం ట్రంపెట్ సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అలుగోలు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కెల్ల గంగరాజు ప్రతిభ కనబరిచాడు. మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని పతకం సాధించాడు. ఈ మేరకు క్రీడాకారుడుని వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ సూర్యారావుని పలువురు అభినందించారు.

పోలీసులకు సేవా పతకాలు

ప్రజాశక్తి - డెంకాడ

పతకాలను అందిస్తున్న కమాండెంట్ గార్గ్

విజయనగరం 5వ బెటాలియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు శుక్రవారం పలు సేవా పతకాలను ఎపిఎస్‌పి కమాండెంట్ మలికా గార్గ్ చేతులు మీదుగా అందించారు. బెటాలియన్ పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులకు అతి ఉత్కృష్ట, ఆంత్రిక్ సురక్ష సేవా పతకాలను 62 మందికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పతకాలతో ప్రోత్సహించడం వారికి మరింత ఉత్సాహంగా ఉంటుందన్నారు.

10న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- గంట్యాడ

ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ఆటో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. మండలంలోని బుడతనాపల్లి జంక్షన్, లక్కిడాం జంక్షన్, తామరపల్లి వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్ మాట్లాడుతూ వేదంతా మల్టీ నేషనల్ కంపెనీ ప్రవేట్ ఫిట్నెస్ సెంటర్లను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే ఫిట్‌నెస్ సెంటర్లను నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా సిఐటియు ట్రాన్స్‌ఫోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో వాహన చట్టాన్ని తెస్తూ డ్రైవర్ మెడకు ఉరితాడు బిగించిందన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఐకమత్యంగా పోరాటం చేసి ఆటో కార్మికులు తమ హక్కులు కాపాడుకోవాలన్నారు. మోటర్ వాహన చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రకటించాలని, రవాణా కార్మికలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న చలో కలెక్టర్ ఆఫీసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దానికి అన్ని స్టాండ్లు నుంచి ఆటో కార్మికులు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు, దేముడు, సత్యరావు, అప్పారావు, కుమార్, సత్యనారాయణ, రాము నాయుడు, శ్రీను, వెంకట్రావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆటో కార్మికులు

ధర్నాను జయప్రదం చేయండి

శృంగవరపు కోట: ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ఆటో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. శుక్రవారం పట్టణంలో గల నాలుగు ఆటో స్టాండ్‌ల వద్ద గల ఆటో కార్మికులతో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ట్రాన్స్‌ఫోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం సిఐటియు పోరాటం చేస్తుందన్నారు. మోటర్ వాహన చట్టాన్ని రద్దుచేస్తూ ప్రభుత్వం ప్రకటించాలని, రవాణా కార్మికలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమాన్ని అమలు చేయాలని, రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న చలో కలెక్టర్ ఆఫీసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దానికి అన్ని స్టాండ్లు నుంచి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా జగన్, ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం మండల కార్యదర్శి రావాడ సన్యాసి దేవుడు, జి నాయుడు, కే దేవుళ్ళు, కే గోపి, డి అచ్చంనాయుడు, సన్యాసిరాజు, పి నాయుడు, ఎం ప్పారావు, అప్పలసూరి, పి అచ్చిబాబు, కే జగన్, జానీ, వి.అప్పారావు, ఎస్.కె మదీనా, పి.రవికుమార్, జి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండల కేంద్రంలో వర్క్‌ఫ్రమ్ హోమ్, ఇతర ప్రభుత్వ పనులకు సంబంధించిన సర్వేలు ఏ విధంగా జరుగుతున్నాయోనని ఎంపిడిఒ జి. భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. సర్వేలు పక్కాగా, వాస్తవికంగా జరగాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

రాజాం: మండలంలోని పొగిరి సచివాలయాన్ని ఎంపిడిఒ శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ హోల్డ్ జిఒ సర్వేను వేగవంతం చేయాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే, చైల్డ్ ఆధార్ నమోదు వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి ఎస్‌డబ్ల్యుపి కేంద్రాలను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన సక్రమంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ దరఖాస్తులకు క్యూ

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టభద్రులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు యువత క్యూ కట్టారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు ఆన్‌లైన్ చేశారు. మెప్మా విభాగంలో ఆన్‌లైన్ చేయడంతో పట్టణానికి చెందిన అధిక సంఖ్యలో యువతీ యువకులు చేరుకున్నారు. 2021 నుంచి 2025కు మధ్యలో డిగ్రీ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్ చేస్తున్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత అర్హులు. టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్స్, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, పాస్ పోస్టు సైజు ఫోటో ఉండాలని శనివారం కూడా ఆన్‌లైన్ చేస్తామని మెప్మా అధికారులు చెప్పారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడుగులు : కిమిడి

ప్రజాశక్తి - చీపురుపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన నివాశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగానే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టారన్నారు. సిఎం చంద్రబాబు గెలిచిన వెంటనే ఉత్తరాంధ్రకు మొదటి సారి వచ్చినప్పుడు అక్కడే ఒక సమావేశం ఏర్పాటు చేసి ఎయిర్ పోర్టు పనులు వేగవంతం చేయడంతో పాటు 2026 జూలై నాటికి పూర్తి చేయాలని చెప్పారన్నారు. ముఖ్యంగా నారా లోకేష్ ఐటి సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి గూగుల్, టిసిఎస్, ఇంపోసిస్ వంటి ఐటి సెక్టార్లను తీసుకువచ్చారన్నారు. ఐటి సెక్టార్‌కి కావలసిన మౌలిక సదుపాయాలన్నింటిని విశాఖపట్నంలో ఏర్పాటు చేసి మరిన్ని కంపెనీలు తీసుకు వచ్చేందుకు అత్యంత వేగంగా లోకేస్ పని చేస్తున్నారని చెప్పారు. ఉత్తరాంధ్రలో ఉపాధి కల్పనే ధ్యేయంగా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. తాజాగా ఢిల్లీ వెల్లిన చంద్రబాబు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ని కలిసి విశాఖపట్నం, విజయవాడలకు మెట్రో రైలు రావాలని వాటికి వంద శాతం నిధులు కేంద్రం ఇవ్వాలని కోరినట్లు నాగార్జున గుర్తు చేశారు. మెట్రో విశాఖపట్నంలోనే కాకుండా శ్రీకాకుళం, విజయనగరంలకు కూడా విస్తరించే విధంగా చేయాలని నాగార్జున చంద్రబాబుని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ: ర్యాలీ చేస్తున్న సిబ్బంది, ఎఒ

ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని 11 నెంబర్ల గల విశిష్ట సంఖ్యను పొందాలని ఎఒ యశ్వంత్‌కుమార్ అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేటలో శుక్రవారం జరిగిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట సేవా గుర్తింపు కార్డు నెంబరును, ఆధార్ కార్డు తరహాలో నమోదు చేయిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ నెంబరు ఉంటూనే ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు రైతులకు అందే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఎఒలు, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: వ్యవసాయాన్ని ఆధునికరించేందుకే కేంద్ర ప్రభుత్వం రైతులకు గుర్తింపు సంఖ్య ప్రవేశపెట్టిందని ఎఒ రవీంద్ర తెలిపారు. మండలంలోని వినాయకపల్లి, ధర్మవరం గ్రామాల్లో శుక్రవారం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ఆధునికరణ చేయడానికి కేంద్రం ప్రభుత్వం రైతులకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డు తరహాలో అందించనుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ నెంబర్ ఉంటేనే వివిధ రకాల కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వనున్న పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణ, సర్పంచులు రైతులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా జయప్రకాష్ స్కూల్ రోడ్డు, అమ్మిగారి కోనేరు గట్టు, రాజా నగర్ కాలనీ, రత్నాల నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. జయప్రకాష్ స్కూల్ రోడ్డులో నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లతో చర్చించారు. అమ్మిగారి కోనేరు గట్టు ఏరియాలో కాంపాక్టర్ బిన్‌కు బయట చెత్తలు ఉండటం గమనించి వెంటనే తొలగించాలని మరలా ఇది పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. రాజా నగర్ కాలనీ శ్మశాన వాటికలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. రత్నాలనగర్ కాలనీలో కాలువలు లేవని ఫిర్యాదు చేయడంతో అక్కడ ప్రజలతో చర్చించి కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాల్సిందిగా మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఆదేశించారు. కృష్ణాపురం రోడ్డులో ఉన్న పాత డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో గల సెక్రెటరీలందరికీ ఆమె పి4 సర్వేపై శిక్షణ ఇచ్చారు.

జెండర్ రిసోర్స్ సెంటర్‌తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జెండర్ రిసోర్స్ సెంటర్‌తో లింగ వివక్ష సమస్యలు పరిష్కారమవుతాయని వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జెండర్ రిసోర్స్ కేంద్రంలో ఆర్‌పిలు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష చూపించి మహిళలు, బాలికల పట్ల నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. దీనివల్ల దాడులు పెరిగి, మహిళలు, బాలికలు బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. వీటిని నివారించడానికి మండల స్థాయిలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించినట్లు తెలిపారు. జెండర్ రీసోర్స్ కమిటిలో ఎంపిడిఒ, ఎస్ఐ, ఎపిఎం, ఐసిడిఎస్ సిడిపిఒ సభ్యులుగా పని చేసి లింగ వివక్ష సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ఎక్కడైనా భార్య భర్తల గొడవలు, లింగ వివక్ష, బాలిక వివాహాలు జరిగితే జెండర్ రిసోర్స్ సెంటర్‌కి సమాచారం ఇచ్చి వారికి అవగాహన కల్పించడంతో బాటు సమస్య పరిష్కారం చేయాలని చెప్పారు. జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రతీ గురువారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఎం ఎల్.పద్మ, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా సిరిమానోత్సవం

గంట్యాడ: ఎల్లమాంబ సిరిమానోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు మేళ తాళాలు నడుమ ఆలయ పూజారి కొండబాబు ఐదు గంటలకు సిరిమాను అధిరోహించారు. అమ్మవారి శతకం పుట్ట నుంచి ప్రధాన వీధి మీదుగా అమ్మవారి ఆలయం వరకు మూడుసార్లు సిరిమాను రథం తిరిగింది. వేలాదిగా భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

పుర వీధుల్లో ఊరేగింపుగా వెలుతున్న సిరిమాను

అయోడిన్ వాడకంపై అవగాహన

తెర్లాం: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ - ఢిల్లీ వారిచే అయోడిన్ లోపంతో ఎటువంటి అనారోగ్యాలు వస్తాయనే దానిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ టీచర్స్‌కి అవగాహన సదస్సు రెండు రోజులు ఏర్పాటు చేశారు. ఐజిడి జిల్లా కోఆర్డినేటర్ వై.అశోక్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆర్థిక సహాయంతో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. విజయనగరం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌కు చెందిన డాక్టర్ ఎం చైతన్య మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల ఎటువంటి అనారోగ్యాలు వస్తాయో వివరించారు. అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్, క్రిటినిజం, ఎదుగుదల లోపం బలహీనత రక్తహీనత అనేది ఏర్పడుతుందన్నారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్లు, డ్రై ఫ్రూట్స్, బీన్స్, క్యారెట్, బెల్లం, చిక్కిళ్ళు, నిత్యం తగు మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు

ప్రభుత్వ భూమి ఆక్రమణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

నగర పంచాయతీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. స్థానిక ఆర్ఒబి పక్కన చంద్రబాబు నగర్ కాలనీలో సర్వే నెంబర్ 60లో అక్రమార్కులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారు. ఈ కాలనీలో ప్రభుత్వ భూములను నకిలీ పట్టాలతో ఇప్పటికే కొంత మంది ఆక్రమించుకున్నారు. దీనికి కొనసాగింపుగా అక్రమార్కులు రెచ్చిపోయి ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికార్లకు ఫిర్యాదు చేస్తే కమిషనర్‌కు చెప్పమని సదరు అధికారి చెప్పడం విడ్డూరంగా ఉంది. నగర పంచాయతీ కమిషనర్ కూడా రెవెన్యూ అధికార్లు, పోలీసులకు సమాచారామిచ్చినట్లు సమాచారం. అక్రమార్కులు కూటమి నాయకులు కావడంతో తమకెందుకులే అని అధికార యంత్రాంగం వ్యవరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కొనసాగడంపై స్థానికులు పెదవి విరస్తున్నారు. ఆక్రమణలను ఆపాలని కోరుతున్నారు.

పి4 సర్వేపై సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పి4సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సమావేశంలో విద్యాశాఖాధికారులు, ఎపిఒ, ఎపిఎం, ఎఒ, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.